# సూర్య

www.suryaa.com

17వ వసంతంలోకి

## నల్గొండ-యాదాద్రి-సూర్యాపేట

శుక్రవారం 03, మే 2024 పేజీలు - 8


# పోలింగ్ సమయాన్ని గంట పాటు పొడిగింపు

## రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన




*నల్గొండ జిల్లా బ్యూరో*

నల్గొండ పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో పోలింగ్ సమయాన్ని గంట పాటు పొడిగిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, నల్గొండ పార్లమెంటు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఆదేశాలు జారీ చేయగా, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. లోకసభ ఎన్నికల పోలింగ్‌ను ఈ నెల 13న ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాల్సిందిగా గతంలో ఎన్నికల సంఘం ఆదేశించిందని, అయితే ఎండల తీవ్రత దృష్ట్యా పోలింగ్ సమయాన్ని మరో గంట పోడగించాల్సిందిగా రాజకీయ పార్టీలు కోరిన నేపథ్యంలో వారి విజ్ఞప్తి

మిగతా 4లో

# ఆలయంలో విశేష పూజలు





యాదగిరి కొండ, మేజర్ న్యూస్ : యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో గురు వారం నిత్య ఆరాధనలు శాస్త్రయుక్తంగా సాగాయి. హరిహరులను ఆరాధిస్తూ మొక్కులు చేపట్టారు. వేకువజామున సుప్రభాతం చేసి పూజారులు హారతి నివేదించారు. ఉత్సవమూర్తులకు అభిషేకించి అర్పించారు. వేదమంత్రాలతో ప్రధానాలయంలో సుదర్శన నారసింహ హెూమం చేపట్టారు. విశ్వక్సేన ఆరాధనతో నారసింహ కళ్యాణం చేశారు. చరమూర్తుల మందిరంలో రామలింగేశ్వర స్వామిని కొలుస్తూ అభిషేకం చేశారు. పాత గుట్టలో నిత్యారాధనలు కల్యాణోత్సవ పర్వాలు జరిగాయి. గురువారం వివిధ కైంకర్యాలలో వచ్చిన ఆదాయం 28,87,191.

# ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని తనికి చేసిన అధికారులు

*నల్గొండ జిల్లా బ్యూరో*

నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఏర్పాటు చేయనున్న లోకసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని గురువారం కేంద్ర ఎన్నికల పరిశీలకులు మనోజ్ కుమార్ మాణిక్ రావు సూర్యవంశి, కళ్యాణ్ కుమార్ దాస్, ఆమోగ్ జీవన్, జిల్లా కలెక్టర్ దాసరి హరి చందన, జిల్లా ఎస్పీ చందనా దీప్తిలతో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఈ కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపుకై ఏర్పాటు చేసిన బారికేడింగ్, స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు హాళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకులు మనోజ్ కుమార్ మానిక్ రావ్ సూర్యవంశి ఓట్ల లెక్కింపుకు వినియోగించనున్న టేబుల్లు, పోలింగ్ కేంద్రాలు, సిసి టీవీల ఏర్పాటు తదితర వివరాలను జిల్లా కలెక్టర్, ఎస్పీల ద్వారా అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట పోలీసు అధికారులు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు,



ట్రాన్స్ కో ఎస్ఈ చంద్రమోహన్, పిఆర్ఈఈ భూమయ్య, డిఈ నాగయ్య, కలెక్టరేట్ ఏఓ మోతిలాల్ తదితరులు ఉన్నారు.

# వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఎమ్మెల్సీ నామినేషన్లు ముగ్గురు దాఖలు

*నల్గొండ జిల్లా బ్యూరో*

వరంగల్ -ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఉప ఎన్నికలలో భాగంగా మొదటి రోజైన గురువారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా బండారు నాగరాజు ఒక సెట్ నామినేషన్ ను దాఖలు చేయగా ,ప్రజావాణి పార్టీ తరపున పాటి శ్రీకాంత్ రెడ్డి ఒక సెట్, తెలంగాణ సకల జనుల పార్టీ నుండి నందిపాటి జానయ్య ఒక్కో సెట్ నామినేషన్లను దాఖలు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం వరంగల్-ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నికు గురువారం ఉదయం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి,పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన ఉదయం నోటిఫికేషన్ జారీ చేశారు. అనంతరం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి రోజు మొత్తం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన తెలిపారు.



# బీజేవైఎం యువ సమ్మేళనంలో నల్గొండ ఎంపి అభ్యర్థి సైదిరెడ్డి

నల్గొండ టౌన్, మేజర్‌న్యూస్ : నల్లగొండ జిల్లా బీజేవైఎం యువ మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువ సమ్మేళన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గారు మరియు జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి. ఈ సందర్భంగా రాష్ట్ర యువ మోర్చ అధ్యక్షులు చేవెళ్ల మహేందర్ మాట్లాడుతూ అబద్ధపు హామీలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇవాళ రాష్ట్ర ప్రజలను రాష్ట్ర యువతను మోసం చేసింది యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తాం ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేస్తాం అని చెప్పి తెలంగాణ రాష్ట్ర యువతను తప్పుదోవ పట్టించి నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాల అవకాశాలు కల్పించకుండా తెలంగాణ యువతను తప్పుదోవ పట్టించే ధోరణి తీవ్రంగా ఖండిస్తున్నాము 6 పథకాలు అమలు చేస్తామని చెప్పి అమలు చేయకుండా ఈరోజు మళ్లీ సిగ్గు లేకుండా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అభ్యర్థులను గెలిపించాలని కోరుకోవడం సిగ్గుచేటు ఎలక్షన్ల తర్వాత నోటిఫికేషన్లు ఉద్యోగ అవకాశాలు కల్పించకుంటే యువమోర్చా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి



రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి నోటిఫికేషన్ ఏపించే విధంగా పోరాటం చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు నరేంద్ర మోడీ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలకు మన యువత కు కల్పించే అవకాశాలను వినియోగించుకొని వారు చేపట్టిన మేకిన్ ఇండియా తో యువతకు యెన్నో అవకాశాలు కల్పిస్తూన్నారు ఖేలో భారత్ పేరుతో మహిళలకు గాని పిల్లల గాని యువతకు గాని ఎంతో మేలు చేకూర్చే విధంగా అవకాశాలు కల్పిస్తున్నారు. కేంద్రంలో

మిగతా 4లో

# నీటి సదుపాయం కల్పించిన గౌని రాజారమేష్ యాదవ్

హాలియా, మేజర్‌న్యూస్ : నల్గొండ జిల్లా హాలియా మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనిలో భూమిలో నీటి శాతం తక్కువ కావడంతో బోర్లు ఎండిపోయి, తాగడానికి నీరు లేక ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రజలకు స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్ ఆదేశాల మేరకు ట్యాంకర్ల సహాయంతో పలు కాలనిలో ఇంటి ఇంటికి నీటి సదుపాయం కల్పించి, పట్టణ ప్రజలకు ఈ వేసవి కాలం ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండాలని, నీటి కొరతతో ఎవ్వరూ ఇబ్బంది పడకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించిన నల్గొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గౌని రాజారమేష్ యాదవ్. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, మున్సిపల్ సిబ్బంది, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వివక్ష లేని సమాజం కోసం

సమాజంపై అవగాహన ఎందరికో ఉండొచ్చు... మార్చాలనే తపన కొందరికే ఉంటుంది. అలా తపించే వారిలో ప్రొఫెసర్ లక్ష్మి ఒకరు. సమానత్వం, వివక్ష లేని మరో సమాజం కోసం నిరంతరం పోరాడుతున్నారు. విద్యార్థి దశ నుంచే హ్యూమనిస్టుగా, యాక్టివిస్టుగా స్త్రీ సమానత్వం కోసం గొంతు విప్పారు. ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీకి మొదటి మహిళా ప్రిన్సిపల్‌గా చరిత్ర సృష్టించారు. రిటైర్‌మెంట్ తర్వాత కూడా స్త్రీ సమస్యలపై తన పోరాటం ఆపలేదు. ముఖ్యంగా ఇటీవల రాష్ట్రంలో పెట్రేగుతున్న కుల దురహంకార హత్యలకు వ్యతిరేకంగా తన గొంతు విప్పుతున్న ఆమెతో మానవి సంభాషణ...

ఇటీవల మన రాష్ట్రంలో కులదురహంకార హత్యలు బాగా జరుగుతు న్నాయి. వీటికి కారణం ఏమిటి?

ఇవి గతంలో కూడా ఉన్నాయి. అయితే బయటకు వచ్చే వాటి సంఖ్య చాలా తక్కువ. ఇప్పుడు మీడియా పెరిగిపోవడం వల్ల బయటకు ఎక్కువగా వస్తున్నాయి. కులం, మతం, మూఢనమ్మకాలు, సంప్రదాయాలు, ఇలా వీటన్నింటి వల్ల తల్లిదండ్రులు, కులపెద్దలు పిల్లల ఇష్టాలను అంగీకరించడం లేదు. రోజురోజుకు సమాజంలో కుల సమస్య పెరిగిపోతుంది. అందుకే ఈ హత్యలు జరుగుతున్నాయి.

ఈ వివాహాల వల్ల అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలు?

మొదట తల్లిదండ్రులు ఆమె ప్రేమను అంగీకరించరు. ఇంట్లో వాళ్ళ ఇష్టాన్ని కాదని పెండ్లి చేసుకుంటే ఇల్లు వదిలి వెళ్ళిపోవాలి. సమాజం కూడా అమ్మాయి నిర్ణయాన్ని స్వాగతించదు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక్కరికైనా ఉద్యోగం లేకపోతే బతకడం కష్టం. ఆర్థిక ఇబ్బందులు వస్తాయి. ఈ ప్రభావం అమ్మాయిలపైనే ఎక్కువగా ఉంటుంది.

అసలు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే అవకాశం అమ్మాయిలకు ఎంత వరకు ఉందంటారు?

ఈ పితృాస్వామ్య సమాజంలో ఆడపిల్లతో పాటే ఆంక్షలు, కట్టుబాట్లు కూడా పుడతాయి. ఎలాంటి బట్టలు వేసుకోవాలి?, ఎలా మాట్లాడాలి?, ఏం తినాలి?, ఎంత తినాలి? వరకు అన్నీ ఆంక్షలే. పెండ్లి సంబంధం వస్తే 'ఈ అబ్బాయి నాకు ఇష్టం లేదు' అని అంటే 'నోరుమూసుకో ఇంకెవరికీ చెప్పకు, నీ చెల్లెళ్ళకు పెండ్లి కాదు' అంటారు. రాజ్యాంగం ప్రకారం వివాహానికి సంబంధించి సమ్మతి హక్కు అమ్మాయికి ఉంది. కానీ దాన్ని ఎవ్వరూ పట్టించుకోరు. అమ్మాయికి జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ కల్పించాలి.

తల్లి ఇంటి పేరు, కులం పెట్టుకోవడంలో ఎన్నో ఆటంకాలు ఉన్నాయి. దీని గురించి మీరేమంటారు?

ఏ బిడ్డకైనా తల్లి ఒక వాస్తవం, తండ్రి ఓ నమ్మకం. తొమ్మిది నెలలు మోసిన తల్లి కులం బిడ్డకు వర్తించదంటారు. ఇది సరైనది కాదు. గతంలో స్కూల్లో తండ్రిపేరే అడిగేవారు. కానీ మహిళా ఉద్యమాల ఫలితంగా తల్లిపేరు కూడా చేర్చు కోగ లిగాం. అలాగే ఓ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పిల్లలు తల్లిదండ్రుల కులాల్లో తమకు ఇష్టమైన ఏ కులాన్నైనా పెట్టుకోవచ్చు.

మొదటి నుంచి మానవీయ విలువలతో పెరిగారు. మీ బాల్యం ఎలా గడిచింది?

మాది మిర్యాలగూడ. అక్కడే పుట్టి, పెరిగాను. అమ్మ విరాటమ్మ, నాన్న రామచంద్రయ్య. ఇద్దరూ వ్యవసాయం చేస్తారు. అమ్మ చాలా కష్టపడేది.

మా ఇంట్లో అన్ని కులాల వారినీ సమానంగా చూసేవారు. మేము ఎనిమిది మంది సంతానం. మా అమ్మ చదువు కోలేదు. నాన్న కొద్దిగా చదువుకు న్నారు. కానీ.. సామాజిక అవగాహనతో మమ్మల్ని చదివించారు. అయితే పదో తరగతి పూర్తి కాగానే ఆడపిల్లకు పెండ్లి చేయాలి అని భావించే పల్లెటూరు మాది. నాకూ అలాగే చేయాలనుకున్నారు. అయితే నేను ఒప్పుకోలేదు. స్కూల్ టాపర్ కావడంతో అన్నయ్యలు సపోర్ట్ ఇచ్చి ఇంటర్‌లో చేర్చారు. తర్వాత ఖమ్మంలో మా అన్నయ్య ఇంట్లో ఉండి అక్కడే డిగ్రీ చేశాను. మళ్ళీ ఇంటికి వెళితే పెండ్లి చేస్తారని అటునుంచి అటే స్నేహితులతో కలిసి హైదరాబాద్ వెళ్ళి పీజీకి ఎన్‌ట్రన్స్ రాశాను. మా ఊరి నుంచి ఎంట్రన్స్ రాసిన వారిలో యూనివర్సిటీలో సీటు వచ్చింది నాకొక్కదానికే. దాంతో ఊళ్ళో అందరూ మెచ్చుకున్నారు. దాంతో అమ్మానాన్నలు గర్వపడ్డారు. నేను ధైర్యం చేసి ఇంటికి వెళ్ళి డబ్బులు తెచ్చుకుని పీజీ పొలిటికల్ సైన్స్‌లో చేరాను. అలా మా కుటుంబంలో ఉన్నత విద్యను చదివిన మొదటి ఆడపిల్లను నేనే.

టీచింగ్‌వైపుకు ఎందుకు వచ్చారు?

పీజీ పూర్తి చేసిన తర్వాత బ్యాంక్ ఉద్యోగం కూడా వచ్చింది. కానీ ఆ టేబుల్ వర్క్ చేయడానికి మనసు అంగీకరించలేదు. ఎమ్‌ఫిల్‌లో చేరాను. తర్వాత 'మహిళా నాయకత్వం' అనే అంశంపై పీహెచ్‌డీ చేశాను. ఎప్పటికైనా అవినీతి ఉండని జాబ్ చేయా లనుకున్నాను. అప్పట్లో అలాంటి జాబ్ టీచింగ్. దాంతో ఇక టీచింగ్ చేయాలని నిర్ణయించుకున్నాను. ఈ వృత్తిలోకి వచ్చిన తర్వాత యంగ్ టీచర్, బెస్ట్ టీచర్ అవార్డు తీసుకున్నాను. 2002లో ప్రొఫెసర్‌గా, తర్వాత ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహించాను.

మరి యాక్టివిస్టుగా ఎలా మారారు?

విద్యార్థినిగా లేడిస్ హాస్టల్ వార్డెన్‌గా బాధ్యతలు చూసేదాన్ని. అక్కడే అనేక విద్యార్థి సంఘాలతో పరిచయాలు ఏర్పడ్డాయి. మా హాస్టల్లో పని చేసే వర్కర్లు ఉండే బస్తీలకు వెళ్ళి వాళ్ళకు అక్షరాలు నేర్పించేవాళ్ళం. యూనివర్సిటీలో ఏ అన్యాయం జరిగినా వ్యతిరేకించేవాళ్ళం. సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం చేసేవాళ్ళం. జెండర్ సమస్యపై, సేవ్ గర్ల్ చైల్డ్ లాంటి ఎన్నో కార్యక్రమాలు చేశాం. ఉమెన్స్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా మరెన్నో కార్యక్రమాలు చేశాం. ముఖ్యంగా అమ్మాయిలకు లీగల్, సోషల్ కౌన్సెలింగ్ ఇచ్చేవాళ్ళం.

మీదీ కులాంతర వివాహమే కదా, ఏమైనా సమస్యలు ఎదుర్కొన్నారా?

సమస్యలేమీ లేవు. మా వారి పేరు శివాజీ. ఆయన నాతో పాటు పీహెచ్‌డీలో చేశారు. దండలు కూడా మార్చుకోకుండా రిజిష్టర్ ఆఫీస్‌కు వెళ్ళి సంతకాలు పెట్టి వచ్చేశాం. పెద్దలు మాత్రం రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఆయనా లెక్చరర్‌గా చేసేవారు. అది మానేసి ప్రస్తుతం 'సర్వ్' అనే సోషల్ ఆర్గనైజేషన్‌లో పని చేస్తున్నారు. గ్రామాల్లో దళితులు, చెంచుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. మాకు ట్రిపులెట్ బేబీస్. ముగ్గురు బాబులు. ప్రస్తుతం ఇంటర్ పూర్తి చేసి పై చదువులకు సిద్ధంగా ఉన్నారు.

ఇన్ని బాధ్యతలు నిర్వర్తించారు. మీరెప్పుడైనా జెండర్ సమస్యను ఎదుర్కొన్నారా?

నేను స్ట్రాంగ్. అందుకే నా జోలికి ఎవ్వరూ రారు. అయితే యూనివర్సిటీలో జెండర్ సమస్యలు చాలా ఉన్నాయి. వీటిపై కచ్చితంగా పని చేసేవాళ్ళం. ఇప్పటికీ చేస్తున్నాం.

సరైన గైడెన్స్ ఇస్తే...

మహిళలు ఓ వ్యక్తిత్వంతో పెరగాలి. చదువుకోవాలి. స్వతంత్రంగా బతికే హక్కు ఉంది అని నమ్మాలి. నీ శరీరంపై నీకు హక్కు ఉండాలి. తనలో ఉన్న శక్తిని గుర్తించాలి. నేను ఆడపిల్లను అనే భావనను పక్కన పెట్టాలి. శారీరకంగా, మానసికంగా స్ట్రాంగ్‌గా ఉండాలి. నా కెరీర్‌లో ఎంతో మంది విద్యార్థులను చూశాను. యువతకు సరైన గైడెన్స్ ఇస్తే మంచి దారిలో వెళతారు. నా దృష్టిలో టీచర్ అంటే పుస్తకాల్లో ఉండేది నాలుగ్గోడల మధ్య చెప్పడం కాదు, సమాజం గురించి, జీవితం గురించి నేర్పాలి. ఉపాధ్యాయులు ఇలా చేయగలిగితే ప్రతి అమ్మాయి, అబ్బాయి ఆణిముత్యాల్లా తయారవుతారు.

ప్రత్యేక చట్టం కావాలి

దేశంలో సమసమాజం రావాలన్నా, కులర హిత సమాజం ఏర్పడాలన్నా, స్త్రీ-పురుషుల మధ్య అంతరాలు తొలగించాలన్నా కులాంతర వివాహాలు చేసుకునే వారికి కొన్ని అవకాశాలు కల్పించాలి. వీరికి రక్షణ కల్పించే ప్రత్యేక చట్టం కావాలి. ముందు ఆ జంటకు ఆర్థికంగా సహకరించాలి. ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. అమ్మాయిలకు ధైర్యం చెప్పాలి. వారి పిల్లలకు అన్నింట్లో 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి. అలాగే భద్రత అనేది కీలకం. కాబట్టి వీరి వివాహాలను రికార్డ్ చేయాలి. అన్నింటి కంటే ముఖ్యమైనది ఇలాంటి వివాహాల పట్ల సమాజానికి అవగాహన కల్పించాలి.

విధాన నిర్ణయాల్లో
భాగస్వామ్యం

విధాన నిర్ణయాల్లో మహిళలకు భాగస్వామ్యం లేదు. మహిళల సమస్యలంటే సంస్కరణ దృష్టితోనే చూస్తున్నారు. మహిళలకు విధాన నిర్ణయాల్లో ప్రాధాన్యం ఇవ్వకుండా స్త్రీ సమానత్వం సాధ్యం కాదు. మన రాష్ట్రంలో మంత్రి మండలిలో ఒక్క మహిళకు అవకాశం ఇవ్వలేదు. వీసీలుగా ఒక్క మహిళను తీసుకోలేదు. ఏండ్లు గడుస్తున్నా మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగానే చూస్తున్నారు. సమాజంలో సగభాగమైన మనకు అధికారంలో కూడా మన వాటా మనకు రావాలి.

# లక్ష్యం

నాంపల్లి, మేజర్‌న్యూస్ ః పడుకున్నవాడు లేచి తిరిగి మళ్లీ పడుకోవడమే జీవితమని కొందరంటున్నారు. 'కలకానిది విలువైనది జీవితం' అన్నాడు.. శ్రీశ్రీ. జీవితం ప్రవాహం, జీవితం నది, జీవితం స్రవంతి. ప్రవాహం నిరంతరం కదులుతుంటుంది. కదలికలేని ప్రవాహం లేదు. నది నిరంతరం చలనంతో ఉంటుంది. అయినా చలించినట్టు కనబడదు. నిరంతరం కదులుతూ కదిలినట్టు కనిపించనిదే జీవితం అంటాడు దాశరథి రంగాచార్య. నది ప్రవాహం జీవనవేగాన్ని సంకేతిస్తున్నది. నీటి పరుగు చైతన్యాన్ని సూచిస్తున్నది. జీవిత ప్రవాహం ప్రచండ వేగంతో వెళ్లిపోతూ ఉంది. అందులో ఎవరెవరి సంస్కారాన్ని బట్టి వాళ్లు తమ సుఖం కోసం కొట్లాడుకుంటున్నారు అంటాడు అసమర్థుని జీవయాత్రలో గోపీచంద్. అసలు మనం సక్రమంగా జీవించలేకపోతున్నాం... జీవితంలో అనేకనేక అవకాశాలు మన ముందు కొస్తుంటాయి. అన్నీ ముఖ్యమనిపించినా ఎదురైన ప్రతి అవకాశం అందిపుచ్చుకోలేము. అందుకే జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానికున్న అవకాశాలను పరిశీలించుకుని ముందుకు పోవాల్సి ఉంటుంది. నీటి ప్రవాహాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. ప్రవాహానికి అడ్డువస్తే నీళ్లు అక్కడే ఆగిపోవు. కొత్తదారి వెతుక్కొని కొండల్లో జలపాతాలుగా రాళ్ల మధ్య పాయలుగా, ఇసుకమేటల్లో ఏర్లుగా ప్రయాణాన్ని సాగిస్తాయి. విద్యార్థి అయితే తాను ఏ వృత్తిలో స్థిరపడదలచుకున్నాడో లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి. అందుకనుగుణమైన కోర్సునే ఎంచుకోవాలి. ఊహల్లో విహరించకుండా వ్యూహంతో చదివితే లక్ష్యం సిద్ధిస్తుంది. ఎక్కడో మారుమూల ప్రాంతంలో పేదరికంతో పోరాడుతూ... గోపాలకృష్ణ ఐఏఎస్ లక్ష్యంగా నిర్దేశించుకుని విజయం సాధించిన అనుభవం మన కండ్లముందే కనబడుతున్నది. "ఒక నదిని దాటడం నీ లక్ష్యమైతే.. అందుకు నావగాని, వంతెన గాని లేకుండా నదిని దాటడం సాధ్యం కాదు" అన్నాడు మావో. అంటే లక్ష్యం మంచిదైనా దాన్ని చేరుకోవడానికి నిర్ణయించుకునే సాధనాలపైన జయపజయాలు ఆధారపడి ఉంటాయి. ఏ లక్ష్య సాధనకైనా క్రమశిక్షణ అవసరం. వ్యక్తిగత లక్ష్యాలతో లాభనష్టాలూ కష్టసుఖాలు ఆయా వ్యక్తుల వరకే పరిమితం అవుతాయి. అదే మన సమాజానికి బాధ్యత వహించినప్పుడు సమిష్టి లక్ష్యంగా మారుతుంది. తప్పుడు లక్ష్యాల వల్ల మనమే కదా నష్టపోయేది అనుకుంటే కుదరదు. దాని ప్రభావం మొత్తం సమాజంపైనా ఉంటుంది. లక్ష్యాలు ఉన్నతమైనవైతే సాధనఎలాంటివైనా పరవాలేదా? శంకరాచార్యుడు జీవాత్మ - బ్రహ్మాత్మల ఏకత్వాన్ని తెలుసుకోవడమే లక్ష్యం అన్నాడు. ఇందుకు జ్ఞాన సంపాదన మార్గమన్నాడు. వీరు వాస్తవ జీవితంతో సంబంధం లేని లక్ష్యాన్ని ఎంచుకున్నారు.

కమ్యూనిస్టుల దృష్టిలో జీవిత లక్ష్యం మానవజాతి సుఖసంపదలతో జీవించడం. భౌతికంగానూ, సాంస్కృతికంగానూ అంతకంతకు ఉన్నత శిఖరాలకు అందుకోవడం. ప్రతి మానవుడు తోటి వారితో కలిసి మానసిక శక్తులను అభివృద్ధి చేసుకోవడానికి అంతకంటే ఎక్కువ స్వేచ్ఛ సంపాదించడం. పరాయి పాలనకు స్వస్తిపలికి స్వాతంత్ర్యం సాధించుకునేందుకు భారత ప్రజలు శత సంవత్సరాలు పోరుసల్పారు. ఈ వందేండ్ల స్వాతంత్ర్య పోరాటం మన లక్ష్యంగా ఉన్నది. లక్ష్యం మహోన్నతమైనదని అందరూ అంగీకరించారు. ఏకాభిప్రాయానికి వచ్చారు. కానీ సాధన మార్గం విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవచ్చు. అహింసను జీవిత లక్ష్యంగా పెట్టుకున్న గాంధీ మహాత్ముడే పిరికితనంతో బానిస జీవితం గడపడం కన్న దౌర్జన్యంతో శత్రువును ప్రతిఘటించడం మంచిదన్నాడు. ఉరితీయబడ్డ భగత్‌సింగ్ దేశభక్తిని పొగుడుతూనే అతడు ఎంచుకున్న మార్గం సరైనది కాదంటూ గాంధీజీ పెట్టిన తీర్మానం కాంగ్రెస్‌లో వీగిపోయింది. ఆ కాలంలో దేశం కోసం పోరాడి అమరులైన వారందరు వీరులుగా కీర్తింపబడ్డారు. స్వాతంత్ర్యం సిద్ధించింది. అప్పుడు ఏంచేయాలి అనే ప్రశ్న ముందుకు వచ్చింది. ఒక సమస్యను పరిష్కరిస్తే ఆ సమస్య పరిష్కారంలో మరొక సమస్య పుట్టుకొస్తుంది. ఒక గమ్యాన్ని చేరుకొని అక్కడే ఆగిపోవడం కాదు. ఎప్పటికప్పుడు సమస్త అవకాశాలను వినియోగించుకుంటూ నూతన లక్ష్యాలను చేరుకోవటం. విజయాల మీద విజయాలు సాధిస్తూ కొనసాగించే అనంతయాత్ర, అట్టి యాత్రలో ప్రతిలక్ష్యం ఒక మజిలీ, మరొక లక్ష్యాన్ని సాధించడానికి అదొక ప్రారంభం. నూతన లక్ష్యాలను నిర్దేశించుకునేటప్పుడు మన మార్గం, గమ్యాన్ని బట్టీ పరిస్థితులను బట్టీ కూడా ఉంటుంది. గమ్యాన్ని మరచిపోతే కోరిన లక్ష్యం కాక విరుద్ధమైన ఫలితాలు వస్తాయి. భారత రాజ్యాంగంలో సోషలిజం లక్ష్యంగా ప్రకటించారు. దాన్ని సాధించాలంటే పెట్టుబడిదారీ పద్ధతులు ఎన్నటికీ పనికిరావు. నెరవేరని లక్ష్యాలు పెట్టుకుంటే ఎవరైనా కొంత కాలానికి గందరగోళంలో పడిపోతారు. భవిష్యత్తు చీకటిగా మారుతుంది. మనిషి సంఘ జీవితాన్ని నియంత్రించటానికి రాజ్యం ఏర్పడింది. అది ఏది చెయ్యాలి, ఏది చేయకూడదో చెబుతుంది. అది ఎక్కువ మందిని బాధపెట్టే స్థితికి వస్తుంది. ఆ బాధలు ఏంచేస్తే పోతాయో లక్ష్యం నిర్ణయించుకోవాలి. బాధలు లేని సమాజం కోసం పాటు పడాలి. ఏదీ తనంత తానై నీదరికిరాదు శోధించి సాధించాలి అదే ధీరగుణం అంటాడు శ్రీశ్రీ. అందుకే ఆదర్శ సమాజ నిర్మాణానికి అందరం అంకితమవుదాం. అలిశెట్టి ప్రభాకర్ అన్నట్టు అన్నం ముద్దలాంటి ఆశయాన్ని అందరం కలిసి, పంచుకుందాం. యుద్ధరంగమైన జీవితాన్ని ఒక్కటిగానే ఎంచుకుందాం.

# జీఎస్టీ

నార్కట్‌పల్లి, మేజర్‌న్యూస్ ః జీఎస్టీ అమలుతో పేదలకు లాభం జరుగుతుందని చెప్పిన మోడీ అమెరికాలో 20 టాప్ కంపెనీల సీఈఓల సమావేశంలో వస్తుసేవల పన్ను సంస్కరణలు చేశామనీ, భారత పన్నుల విధానం అమెరికా బిజినెస్ పాఠశాలల్లో పాఠ్యాంశంగా చేర్చవచ్చునని ప్రచారం చేస్తున్నారు. మనదేశ భక్తులు బడుగుల నెత్తిమీద చెయ్యిపెట్టి బడా కార్పొరేట్ సంస్థలకు స్వాగతం పలుకుతున్నారు. మోడీ ద్వంద్వ నీతి బట్టబయలైంది.

కేంద్ర ప్రభుత్వం వస్తుసేవల పన్ను ప్రారంభాన్ని ఒక పెద్ద ఘనకార్యంగా భావిస్తోంది. కేంద్ర పన్నుల విధానానికి వ్యతిరేకంగా వస్త్ర వ్యాపారులు బంద్ పాటించారు. వివిధ రకాల నిరసనలు తెలుపుతున్నారు. వస్త్ర పరిశ్రమలో వెయ్యి రూపాయలు విలువగల వస్త్రాలు కొంటే ఒక పన్ను విధానం, దాటితే మరొక పన్ను విధించటం వల్ల పన్నులు భారంగా పరిణమించనున్నాయి. ముఖ్యంగా చేనేత వస్త్రాల ఉత్పత్తి ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి జీఎస్టీ భారంతో చేనేతరంగం మరింత రక్షణ లేకుండాపోయే ప్రమాదం ఉంది. బీడీ పరిశ్రమ దివాళా తీసి లక్షలాదిమంది బీడీ కార్మికులు ఉపాధిలేక రోడ్డున పడతారు. పాత పన్నుల విధానంలో 18శాతం పన్ను చెల్లిస్తున్నారు. ఇప్పుడు 28శాతానికి పెరగడం వలన అమ్మకాలు పడిపోతాయి. పరిశ్రమలు మూతపడతాయి. కాబట్టి బీడీ పరిశ్రమను జీఎస్టీ నుండి మినహాయించాలనే కోరిక సమంజసమైనదే. ఒకప్పుడు పాలకులు చిన్న పరిశ్రమలను పెద్ద పరిశ్రమల పోటీ నుండి కాపాడేందుకు ప్రత్యేకమైన పన్ను రాయితీలు ఇచ్చేవారు. ఇప్పుడు టర్నోవర్‌ను నామమాత్రంగా పెంచి పన్ను భారాల నుండి మినహాయింపు లేకుండా చేశారు. పన్నుల భారం, కార్పొరేట్ సంస్థల పోటీ తట్టుకోలేక పరిశ్రమలు మూతపడతాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. మరొకవైపు జీఎస్టీ అమలు వలన లక్షల ఉద్యోగాలు వస్తాయని ఊదరగొడుతున్నారు. పాలకులు నిరుద్యోగులను భ్రమలకు గురిచేస్తున్నారు.

దేశంలో ఇప్పటికి 60శాతం మందికి పైగా వ్యవసాయం మీద ఆధారపడి పనిచేస్తున్నారు. ఈ రంగం అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. పంటలకు గిట్టుబాటు ధరలు రాక అన్నదాతలు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. జీఎస్టీ వ్యవసాయ రంగాన్ని కూడా విడిచిపెట్టలేదు. గతంలో అన్ని రకాల ఎరువుల మీద వ్యాట్ 5శాతం మాత్రమే ఉండేది. వస్తుసేవల పన్నులు అమలు అయితే అదనంగా 7శాతం పన్ను పెరుగుతుంది. అదే స్థాయిలో ఎరువుల ధరలు కూడా పెరుగుతాయి. క్రిమి సంహారక మందుల మీద 18శాతానికి పన్నులు పెరుగుతాయి. గోరుచుట్టుపై రోకటిపోటులాగా ఇప్పుడు జీఎస్టీ పన్నుల వలన రైతు నెత్తిన అప్పులు పెరుగుతాయి. ప్రజలెవ్వరూ కోరకుండా పన్నుల విధానాలలో పాలకులు మార్పులు ఎందుకు చేస్తున్నారు? అసలు దేశమంతా ఒకే పన్ను పద్ధతి పాటించాలని ఎవరు బలవంత పెట్టారు? కేంద్ర పాలకులు కార్పొరేట్ శక్తుల పంచన చేరారు. ముందు రిటైల్ రంగంలో సంస్కరణలు చేశారు. వాల్‌మార్ట్ లాంటి సంస్థలకు స్వదేశీ గుత్త సంస్థలకు తలుపులు తెరిచారు.

కార్పొరేట్ పంజరంలో చిక్కిన అధికార పార్టీ చిలుకలు ఒకే దేశం ఒకే పన్ను ఉండాలనే చిలుక పలుకులు పలికారు. ప్రజలకు లాభం జరుగుతుందని ప్రచారం చేశారు. ఏకాభిప్రాయ సాధన పేరుతో అనేక ప్రయత్నాలు చేసి, పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ ద్వారా ఒకే పన్ను ఆమోదింపజేసుకున్నారు. ఫెడరల్ వ్యవస్థపై వేటు వేశారు. గతంలో పన్నుల వ్యవస్థ కేంద్రం చేతిలో ఉండాలా రాష్ట్రం చేతిలో ఉండాలా అని రాజ్యాంగ నిర్మాతలు చర్చించి ప్రత్యక్ష పన్నులు కేంద్రం, పరోక్ష పన్నులు రాష్ట్రాలకు హక్కు భుక్తం చేశారు. ఒకే పన్ను విధానం రావడంలో కేంద్రం ముందు రాష్ట్రాలు సాగిలపడే పరిస్థితి వచ్చింది. వస్తుసేవల పన్నును నిర్ణయించడానికి జీఎస్టీ కౌన్సిల్ ఏర్పడింది. గతంలో పరోక్ష ప్రత్యక్ష పన్నుల వసూలు ఉండేది. ఇప్పుడు మొత్తం పన్నులను మూడు కేటగిరీలుగా విభజించి పన్నులు వేయాలని నిర్ణయించారు. జీఎస్టీ సమావేశానికి హాజరైన రాష్ట్ర మంత్రి తారక రామారావు కొత్తచట్టం వలన రూ. 11వేల కోట్ల భారం తెలంగాణపై పడుతుందని తెలిపారు. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఇన్ని భారాలు పడితే దేశ ప్రజలపై ఎంత భారం పడుతుందో తలుచుకుంటేనే కడుపు తరుక్కుపోతోంది. ముందూ వెనకా ఆలోచించకుండానే టీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రం అడిగిందే తడవుగా జీఎస్టీని ఆమోదించిన ఫలితంగా ప్రజలపై పెద్ద ఎత్తున భారాలు పడుతున్నాయి. వస్తుసేవల పన్ను విధానంలో మార్పులు జరగాలంటే కేంద్రానికి ఇష్టం లేకుండా ఏదీ జరగదు.

# బతకాలంటే యుద్ధం చేయాలా ?

త్రిపురారం, మేజర్‌న్యూస్ ః ఏలికలకు రైతులు అక్కరలేదేమో...! కానీ ఈ దేశానికి రైతులు కావాలి... భూమిని బువ్వగా మార్చి ప్రజల ఆకలి తీర్చడానికి ఈ దేశానికి రైతులు కావాలి. అందుకు వారికి భూమి కావాలి... సాగుకు సాయం కావాలి. నెత్తురు చెమటగా చేసి, సత్తువ ధారపోసి మన్నును అన్నంగావించే వ్యవసాయం వారికి ఫలసాయం కావాలి.... మన ఏలికలకు రైతులు అక్కరలేదు కానీ, రైతుకు ఆధారమైన భూమి కావాలి. భూమి మీద గాలి, నీరు, మట్టితో పాటు భూమి తన గర్భంలో దాచుకున్న అనంతమైన సంపద కావాలి. ఎవరి కోసం..? ప్రజల కోసమే అనుకుంటే పొరబాటు..! కంపెనీల కోసం... కంపెనీల యజమానుల కోసం..!! ఎందుకంటే వారి సేవకే ఈ ప్రభుత్వాలు. ఇవి పైకి ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలుగానే కనిపిస్తాయి. కానీ ఇవి కార్పొరేట్లు కోరుకున్న ప్రభుత్వాలు. వీరు తలచుకుంటే అమెరికాలో నిలువెల్లా టెంపరితనం నిండిన ట్రంప్‌నైనా అధ్యక్షుడిని చేయగలరు, ఇండియాలో గుజరాత్‌ను రక్తసిక్తం చేసిన మోడీనైనా ప్రధానిని చేయగలరు. కానీ అక్కడ ట్రంపైనా, ఇక్కడ మోడీ అయినా సేవలు చేయవలసింది ఈ కార్పొరేట్ కంపెనీలకే... వారి కృాఎషి మొత్తం ప్రకృాఎతి సంపదను, మానవ శ్రమను కొల్లగొట్టి వీరికి కట్టబెట్టడానికే. ఇప్పుడు ప్రపంచమంతటా జరుగుతున్న ఈ తతంగమే దేశంలోనూ జరుగుతున్నది. మన రాష్ట్రంలోనే కాదు దేశమంతటా రైతుల్లో చెలరేగుతున్న అసంతృాఎప్తి జ్వాలలన్నీ దీనికి సూచికలే..!

దిక్కుతోచక రైతులు పంటలను తగుల బెట్టుకోవడం, మార్కెట్ యార్డుల వద్ద ధర్నాలు చేయడం మాత్రమే చూసిన దేశానికి తొలిసారిగా 'సమ్మె' సెగను చూపించారు మహారాష్ట్ర రైతులు. లక్షలాది లీటర్ల పాలను బజారులో పారించి, టన్నుల కొద్దీ కూరగాయలను వీధుల్లో కుమ్మరించి, వేలాది గేదెలతో రహదారులను దిగ్బంధనం చేసి ప్రభుత్వానికి దిమ్మతిరిగేలా చేశారు మధ్యప్రదేశ్ రైతులు. వీళ్లేం చేస్తారులే అన్న అధికారుల అలసత్వానికి, ప్రభుత్వ అహంకారానికి తిరుగుబాటు రుచి చూపించారు తెలంగాణ రైతులు. వీరందరికంటే ముందు మోడీ స్వరాష్ట్రంలోనే ఈ పోరాటాలకు శ్రీకారం చుట్టారు గుజరాత్ రైతులు. దేశం నడిబొడ్డున మన ప్రభుత్వాల చేతకాని తనాన్ని ఎలుగెత్తి చాటారు తమిళ రైతులు. కానీ మన ప్రభుత్వాలేం చేస్తున్నాయి. ఆవేదన ఆపుకోలేక సమ్మెకు దిగిన రైతును నిర్దాక్షిణ్యంగా నిర్బంధించింది మహారాష్ట్ర ప్రభుత్వం. గుండె మంటను తట్టుకోలేక రోడ్డెక్కిన రైతుకు "తూపాకీ గుండ్ల"తో సమాధానం చెప్పింది మధ్యప్రదేశ్ ప్రభుత్వం. కడుపు మండి కండ్లు తెరిపించే ప్రయత్నం చేసిన రైతుకు సంకెళ్ళు వేసింది తెలంగాణ ప్రభుత్వం. ఇంతకీ వీరు చేసిన నేరమేమిటి..? ప్రభుత్వాలే ప్రకటించిన ఉచిత విద్యుత్, సాగునీరు కావాలన్నారు. రుణమాఫీని గుర్తుచేసారు. పాల ధరను పెంచమన్నారు. చేసిన కష్టానికి, పెట్టిన పెట్టుబడికి తగిన ధర అడిగారు. ప్రజాస్వామ్యంలో వారికి ఆ మాత్రం హక్కులేదా..? కాళ్ళకింద నేల కరిగిపోతుంటే, రెక్కల కష్టం నక్కల పాలవుతుంటే రైతులేం చేయాలి పోరాడటం తప్ప...!

నేటికీ మనది వ్యవసాయ దేశం. 70శాతం మంది ప్రజలు వ్యవసాయం మీదే ఆధారపడి జీవిస్తున్నారు. ఆ ప్రజలనే పట్టించుకోని ఈ ప్రభుత్వాలనేమనాలి. గతంలో రైతులకు చేతల్లో ఏమీ చేయకపోయినా కనీసం మాటల్లోనైనా రైతే దేశానికి వెన్నెముక అనీ, జై జవాన్.. జైకిసాన్.. అని నినదించేవారు ఏలికలు. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వంలో ఆ మాత్రం ప్రస్తావన కూడా కనిపించకపోవడం ఈ ప్రభుత్వ వైఖరిని చెప్పకనే చెవుతోంది. అధికారంలోకి రాకముందు మేనిఫెస్టోల్లో తప్ప అధికారంలోకొచ్చాక రైతుల ఊసే మరిచిపోయారు. రైతులకు రుణమాఫీ అన్నారు. దేశంలో గానీ, రాష్ట్రంలో గానీ అప్పునపడ్డ రైతులెందరూ, రుణ విముక్తి కలిగించింది ఎందరికీ..? ప్రపంచంలోనే అత్యధిక ఉత్పత్తి చేసే మన మిర్చి రైతుల హాహాకారాలను ఎవరు పట్టించుకున్నారు...? వ్యవసాయ రంగంలోకి ప్రవేశిస్తున్న కార్పొరేట్ కంపెనీలకు, భూస్వాములకు, వాణిజ్య బ్యాంకుల ద్వారా వేల కోట్ల పంట రుణాలనిచ్చిన ఈ ప్రభుత్వాలు పేద రైతులను మాత్రం ప్రయివేటు రుణాల బారిన పడేసి ఆత్మహత్యల పాలు చేశాయి. దేశంలో 70శాతం ప్రజల జీవన్మరణ సమస్యను దాచిపెట్టి అభివృాఎద్ధి గురించి మాట్లాడటం కాన్సర్ వుండుకు ప్లాస్టర్ వేయడమే.... అది గాయాన్ని కనిపించనీయదు కానీ మాన్పించలేదు కదా..!

అది తెలంగాణ కావొచ్చు, ఆంధ్రా కావొచ్చు, కేంద్రం కావొచ్చు... ఇలాంటి ప్రభుత్వాలన్నీ రైతును ఆత్మహత్య తప్ప గత్యంతరం లేని స్థితికి నెట్టి, వ్యవసాయాన్ని నిరుత్సాహపరచి భూమికి దూరం చేయడమే లక్ష్యంగా సాగుతున్నాయి. వివిధ శక్తుల స్వార్థ ప్రయోజనాల కోసం రకరకాల పద్ధతుల్లో భూఆక్రమణే ఏకైక అజెండాగా కదులుతున్నాయి. ఈ తెర వెనుక కుట్రల ఫలితమే నేటి రైతాంగ సంక్షోభం. కానీ అంతిమంగా ప్రజలే నిర్ణేతలన్న విషయాన్ని నేతలు గుర్తుంచుకోవాలి. "భూమి గుండ్రంగా ఉంది. తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరగడం వలన పగలు, రాత్ర ఏర్పడుతున్నాయి" అని చెప్పినందుకు శాస్త్రవేత్తలకు మరణదండన విధించిన చరిత్ర మన పాలకవర్గాలది. ఎందుకంటే భూమి తమ చుట్టూ తిరగాలనీ, తమ గుప్పిట్లో ఒదగాలని వారి కోరిక.. కానీ అది సాధ్యమా..?

# ఇదేనా సుపరిపాలన ?

ఏలినవారి లీలలు రోజురోజుకీ వింత గొల్పుతున్నాయి. సుపరిపాలనకు తమను తామే ఓ నమూనాగా ప్రచారం చేసుకునేవాళ్ళు, అవినీతి అక్రమాలకు ఆమడదూరమని ప్రకటించుకునేవాళ్ళు, క్రమశిక్షణకు నిబద్ధతకు మారుపేర్లమని నీతులు బోధించేవాళ్లు ఏపాటి పనిమంతులో ఆచరణలో పదేపదే రుజువవుతున్నది. వీరి విధానాల ఫలితంగా దగాపడిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించండి మొర్రో అంటూ వీధుల్లోకొచ్చి పోరాడుతుంటే విధులు మరిచిన నేతలు వింత వింత విన్యాసాలు చేస్తూ ప్రజలను, ప్రజా ఉద్యమాలను అపహాస్యం చేస్తున్నారు. దేశవ్యాపితంగా రైతాంగం ఆకలి చావులతో, ఆత్మహత్యలతో అల్లాడుతుంటే నేతలు యోగాసనాలు వేసుకోండి అంటూ సూక్తులు వల్లిస్తున్నారు. ప్రత్యేకించి బీజేపీ పాలిత రాష్ట్రాలు రైతుల ఆగ్రహజ్వాలలతో మండుతుంటే అర్థంలేని దీక్షలు చేస్తూ నీరో చక్రవర్తులను తలపిస్తున్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి వినోదాల్లో తేలియాడుతున్నారు.

బీజేపీ పాలనలో దళితులు, ముస్లింలే కాదు, ఇప్పుడు రైతులు కూడా దేశ రాజకీయ చదరంగంలో పావులుగా మారుతున్నారు. అటు బీజేపీ గానీ, ఇటు టీఆర్ఎస్ గానీ స్వాభిమానంతో బతికే రైతును ప్రభుత్వాల సహాయం మీద ఆధారపడే స్థితికి దిగజార్చి వ్యవసాయాన్ని సంక్షోభంలో కొనసాగిస్తున్నాయి. ఓట్లు అవసరమైనప్పుడు రుణమాఫీ లంటున్నాయి. అవసరం తీరాక ఆ ఊసే మరిచిపోతున్నాయి. అంతెందుకు మన రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా అధికారం కోసం ఇద్దరు చంద్రులు రుణమాఫీలు ప్రకటించారు. కానీ అధికారం చేపట్టి మూడేండ్లు ముగుస్తున్నా ఆ రుణమాఫీ ఇంకా సాగుతూ...నే ఉంది..! అప్పట్లో దీనిని వ్యతిరేకించిన ప్రధాని నరేంద్రమోడీ ఉత్తరప్రదేశ్‌లో అధికారం కోసం ఇదే రుణమాఫీని ప్రజలకు వాగ్దానం చేశారు..!! ఇప్పుడేమో "రుణమాఫీ ఒక ఫ్యాషన్ అయిపోయింది' అంటూ వెంకయ్యనాయుడు హేళన చేస్తున్నారు. ఇదంతా ఏరుదాటి తెప్ప తగలేసిన చందంగా ఉంది. ఫలితంగా ఈ దేశంలో ప్రభుత్వాల విధానాల వలన దగాపడుతున్న ప్రజానీకంలో రైతులు ముందు వరుసలోకి వస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అయితే ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది.

నేడు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో ఏం జరుగుతున్నది..? బీజేపీకి ఘనవిజయాలను అందించిన ప్రజలే వారి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆందోళనలకు దిగుతున్నారెందుకు..? రాష్ట్రం ఏదైనా, ప్రాంతం ఏదైనా నేడు దేశంలో రైతులు అడుగుతున్నదేమిటి? చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలంటున్నారు. రుణమాఫీని తక్షణమే అమలు చేయమంటున్నారు. గిట్టుబాటు ధర కల్పించాలంటున్నారు. బలవంతంగా భూములు గుంజుకుని నిర్వాసితుల్ని చేయొద్దని వేడుకుంటున్నారు. కానీ బీజేపీ చేస్తున్నదేమిటీ? వారి న్యాయమైన కోర్కెలను పెడచెవిన పెడుతున్నది. ఆందోళనకు దిగితే క్రూర అణచివేతకు వూనుకుంటున్నది. కాల్పులకు సైతం ఒడిగడుతున్నది. ఈ కాల్పుల్లో మధ్యప్రదేశ్‌లో ఆరుగురు రైతులను బలితీసుకున్నది. వందలాదిమంది రైతుల రక్తం కండ్లజూసింది. మహారాష్ట్రలో రైతులపై పెల్లెట్‌గన్స్ ప్రయోగించింది. పన్నెండుమంది రైతులను క్షతగాత్రులను చేసింది. ఇంత జరుగుతుంటే సమస్యను పరిష్కరించాల్సిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శాంతికోసం దీక్షకు కూర్చుంటారు..! మరో మంత్రి సినిమాహాల్లో టికెట్లు అమ్ముకుంటారు..! ఇంకో మంత్రి ఎన్నికల కమిషన్‌కు తప్పుడు లెక్కలు చూపినందుకు అనర్హతకు గురవుతారు. ప్రధాని మాత్రం ఉలుకూ పలుకూ లేకుండా యోగముద్రలో లీనమవుతుంటారు. తమకు పెట్టని కోట అని చెప్పుకుంటున్న ఉత్తరప్రదేశ్‌లో కూడా వేలాదిగా రైతులు రోడ్లమీదకొచ్చి శవాసనాలేసి నిరసన తెలుపుతున్నా ఆయన కండ్లు తెరువకపోవడం రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేలు వాయిస్తూ కూర్చున్న నీరో చక్రవర్తిని తలపిస్తున్నది. నోరు తెరిస్తే రైతులపై అపారమైన ప్రేమ కురిపించే ఏలికల నాలుకలు ఇప్పుడు మాట మారుస్తున్నాయి. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని అడగటమే పాపమైంది. ఒక వ్యవసాయ విధానమంటూ లేని ప్రభుత్వాలు ఎంతసేపటికీ వ్యాపార వర్గాల ప్రయోజనాలనే తప్ప ఉత్పత్తిదారులైన రైతుల ప్రయోజనాలను చూడటం లేదు. నిజానికి వ్యవసాయరంగంలో వచ్చిన మార్పుల వలన పంటల దిగుబడి పెరిగింది. ఆ మేరకు పెట్టుబడులూ పెరిగాయి. దీంతో పెరిగిన దిగుబడులకు తగిన గిట్టుబాటు ధర రాక అయినకాడికి అమ్ముకోక తప్పని పరిస్థితి రైతులకొచ్చింది. ఫలితంగా పెట్టుబడికోసం చేసిన అప్పులు పేరుకుపోయి ఆత్మహత్యలకు దారితీస్తున్నాయి. దీనిని పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకపోగా రైతును వ్యవసాయానికి దూరం చేసి కార్పొరేట్లను వ్యవసాయంలోకి ఆహ్వానించేందుకు ప్రయత్నిస్తున్నది. ఫలితమే నేటి వ్యవసాయ సంక్షోభం...! ఎన్నికల ముందు రుణమాఫీ అన్నారు. కొత్తగా రుణసాయం అందిస్తామన్నారు. పంట సాగులో పెట్టుబడికి అదనంగా 50శాతం లాభంతో మద్దతు ధర కల్పిస్తామన్నారు. మూడేండ్ల కింద చెప్పిందే చేయండని అడుగుతున్నారు రైతులు. ఇచ్చిన మాట నిలబెట్టుకోనందుకు సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి, అణచివేతలు, అపహాస్యాలను కానుకగా ఇస్తారా..!? ఇదేనా బీజేపీ సుపరిపాలన..?

# నిప్పుల కొలిమి

నాంపల్లి, మేజర్‌న్యూస్ ః రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారింది. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. నీళ్లు లేక జనం గొంతెండుతోంది. రోళ్లు పగులుతున్నాయి. భూపాలపల్లి జిల్లా చెల్పూరులో 50 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. ప్రజలు అతలాకుతలమవుతున్నారు. భద్రాద్రిలో భార్యభర్తలు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఎండవేడిమిని తట్టుకోలేక సూర్యోద్రేకానికి భస్మీపటలమైంది. 1901 నుండి నేటి వరకు ఇంత ఘనం ఎండలు ఎప్పుడూ నమోదు కాలేదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. సూర్యుడి ఉగ్రతాపానికి ఉష్ణోగ్రతలు పైకి ఎగబాకుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు ముందే హెచ్చరించారు. అయినా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. నల్లగొండ జిల్లాలో రైతు సమగ్ర సర్వేకు వెళ్లిన ఏఈఓ వడదెబ్బ తాకి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృాఎతిచెందాడు. పెద్దపల్లి జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్త విధులు ముగించుకుని వస్తుండగా వడగాలి తగిలి జ్వరంతో మరణించింది. పొలంలో మంటలు ఆర్పేందుకు వెళ్ళిన ఇద్దరు రైతులు సజీవదహనమయ్యారు. తెలుగురాష్ట్రాలలో రోజుకు సగటున 20మందికి పైగా సూర్యతాపానికి బలవుతున్నారు. సాధారణం కన్నా 5 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగితే వడగాలులుగా గుర్తిస్తారు. 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే ప్రజలు వడదెబ్బకు గురవుతారు. ఆరోగ్యశాఖ తెలిపిన వివరాల ప్రకారం రాష్ట్రంలో 6384 మందికి వడదెబ్బ తగిలినట్టు ప్రకటించారు. 171 మంది చనిపోయినట్టు ప్రకటించారు. ఈ లెక్కలు ప్రభుత్వ ఆస్పత్రిలో నమోదైనవి మాత్రమే. ఇంకా ప్రయివేటు ఆస్పత్రులలో లెక్కలు తీసుకుంటే ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. గత నాలుగేండ్లలో వడదెబ్బకు దేశవ్యాపితంగా 4620 మంది చనిపోయారు. అందులో తెలుగు రాష్ట్రాల ప్రజలే 90శాతం పైగా ఉన్నారు. ఉమ్మడిరాష్ట్రంలో 4246 మంది వడదెబ్బకు చనిపోవడం ఆందోళన కలిగించింది. ఇందులో ఎక్కువమంది ఉపాధి కూలీలూ గొర్రెల కాపరులూ కావడం విచారకరం. ప్రభుత్వం ఉపాధి కార్మికులకు నీడ, నీళ్ళు ప్రాథమిక వైద్య సౌకర్యాల ఏర్పాటులో విఫలమైంది. ఫలితంగా పేదల మరణాలకు కారణమైంది. ఇప్పుడు తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా అందుకు భిన్నంగా ఏమీలేదు.

రోజూ వివిధ శాఖల పనితీరుపై తీరికలేకుండా సమీక్షలు జరుపుతున్న పాలకులు వడదెబ్బ మరణాలపై ఎందుకు సమీక్ష జరపడం లేదో ఆలోచించుకోవాలి. ఉపాధి పనులు జరుగుతున్న ప్రతిచోటా కూలీలు వడదెబ్బకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ ఆస్పత్రులలో వడదెబ్బకు గురైన వారికి ఇచ్చేందుకు కనీసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో పెట్టలేదు. ప్రభుత్వం వడగాలుల నుండి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు చైతన్య కల్పించటం మరిచింది. మండే ఎండలకు ప్రాణనష్టమే కాదు ఆస్తినష్టం కూడా అధికంగానే జరుగుతున్నది. భూపాలపల్లిలో 20 గుడిసెలు, యాదగిరిగుట్టలో 75 గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. మంచిర్యాలలో షార్ట్ సర్క్యూట్‌తో వెయ్యి బస్తాల ధాన్యం కాలిపోయింది. ఆయా ప్రాంతాలలో అగ్నిమాపక కేంద్రాలు అందుబాటులో లేవు. కోట్లాది రూపాయలు అస్తినష్టం జరుగుతున్నది. ఇప్పటికీ అగ్ని ప్రమాదాలను అరికట్టడంలో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదు.

హైదరాబాద్ సమీపంలో ఉన్న షాద్‌నగర్‌లో ఈవేసవిలో ఒక్కొక్క కుటుంబం మంచినీటి కోసం నెలకు రూ.2,500 ఖర్చు చేస్తున్నారు. తాగునీటి కొరత పల్లెలను పట్టిపీడిస్తున్నది. ప్రత్యామ్నాయం చూడాల్సిన పాలకులు చేతులెత్తేశారు. ఎప్పుడో వచ్చే మిషన్ భగీరథకు పాలకులు ఊదరగొట్టి జనానికి ఎండమావుల్లో నీళ్ళు తాగిస్తున్నారు. గత ఏడాది ప్రయివేటు బావులకు ఇవ్వాల్సిన కోట్లాది రూపాయలు చెల్లించలేదు. ఇప్పుడు బావుల యజమానులు లీజుకివ్వమంటే పాతబాకీ చెల్లించాలని అడుగుతున్నారు. ధనికరాష్ట్రం, బంగారు తెలంగాణ అని బడాయి మాటలు చెప్పే ఏలికలు పేదలకు నీళ్ళు కూడా అందించలేని దుస్థితిలో పడ్డారు.

గత ప్రభుత్వాలలో వడగాలులను ప్రకృాఎతి విపత్తుల కమిటీ పరిధిలో చేర్చేందుకు కొంత చర్చ జరిగింది. కానీ ఫలితం లేదు. మోడీ సర్కారు కూడా ఆవైపు ఆలోచన చేయలేదు. వడగాలులను ప్రకృాఎతి విపత్తుల జాబితాలో చేర్చడం వలన బాధితులకు సత్వరం లబ్ది చేకూరుతుంది. రాష్ట్ర ప్రభుత్వం మీద భారం తగ్గుతుంది. అందుకే వడగాలులను ప్రకృాఎతి విపత్తుల జాబితాలో చేర్చాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రం మీద ఒత్తిడి చేయాలి. గతంలో వడదెబ్బ మృాఎతులకు ఆపద్బంధు పథకం ద్వారా కొంత ఆర్థిక సహాయం అందించేవారు. మృాఎతుల వివరాలు సేకరించేందుకు ముగ్గురు అధికారులతో కిందిస్థాయి కమిటీ కూడా ఉంటుంది. కానీ ఇప్పటివరకూ వడదెబ్బ మృాఎతులను రికార్డు చేయలేదు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించలేదు. ఇప్పటికైనా వడదెబ్బ మృాఎతులకు ఆపద్బంధు పథకం అమలుచేసి ఆర్థిక తోడ్పాటు అందించాలి. వడగాలులను ఎలా ఎదుర్కోవాలో పాలకులు ప్రజలలో చైతన్యం కల్పించాలి. వడదెబ్బ మరణాలను అరికట్టాలి. అందుకు సత్వరమే యుద్ధప్రతిపాదికన చర్యలు చేపట్టాలి.

# అరణ్యం

తిప్పర్తి, మేజర్‌న్యూస్ ః అడవులు భద్రంగా ఉంటే మనుషులు క్షేమంగా ఉంటారు. ఈ చిన్న విషయం తెలియక కాదు, తెలిసీ అడవుల విధ్వంసాన్ని ఆపలేకపోవడం ఆధునిక మానవుని దుస్థితి. మరీ ముఖ్యంగా సంపన్న వర్గాల, సంపన్నదేశాల విధానాలు అడవుల క్షయానికి దారితీస్తున్నాయి. ఇటీవల అమెజాన్ అడవులు దగ్ధం కావడం పర్యావరణవేత్తల్ని, ప్రకృాఎతి ప్రేమికుల్ని తీవ్ర ఆందోళనకు లోను చేసింది. ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. తమ అభివృాఎద్ధికి ఆటంకమైతే అడవుల్ని ఉపేక్షించడం సాధ్యం కాదన్నది పాలకుల సమాధానం.

మన దగ్గర నల్లమల్లలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా వినిపించిన తీవ్ర నిరసనల నేపథ్యంలో వాటిని అనుమతించబోమని పాలకులు చెప్పారు. అయినప్పటికీ ఆచరణలో ఏం జరుగుతుందన్నది ప్రశ్నే.. ఆదిమానవుల నివాసం అరణ్యమే. అరణ్యాల్ని దాటుకొని ప్రయాణించే క్రమాన చెట్లని నరికివేసి, వ్యవసాయయోగ్యమైన భూములుగా మార్చారు. అంతమాత్రాన ఇవాళ భారీ ప్రాజెక్టులు, మైనింగ్ తవ్వకాల కోసం వేలాది హెక్టార్ల అడవుల్ని నిర్మూలించడం క్షంతవ్యం కాదు. ఎందుకంటే జీవవైవిధ్యం సమతుల్యం మీదనే మానవుని జీవనం ఆధారపడి ఉంది. ఉత్తరాఖండ్‌లో ఉవ్వెత్తున వచ్చిన వరదలకు, అక్కడ కొండల మీద నిర్మించిన ప్రాజెక్టులే కారణమని పర్యావరణవేత్తలు తేల్చిచెప్పారు.

మానవుని అవసరాలకు అనుగుణంగా అడవుల్ని ఉపయోగించుకోడంలో తప్పులేదు. అడవుల్లోని జీవ వైవిధ్యానికి, పచ్చదనానికి భంగం కలగకుండా వాటిని వినియోగించుకునే విధివిధానాల్ని అనుసరించాలి. దీనికి భిన్నంగా అడవుల్ని నేలమట్టం చేయడం దుర్మార్గం. ఇది కూర్చున్న చెట్టు కొమ్మను తానే నరుక్కోవడం వంటి ఆత్మహత్యాసదృాఎశ్యమైన చర్య.

ఈ సత్యం అందరికీ తెలుసు. అయినా లక్షల హెక్టార్ల అడవుల నిర్మూలనకు ప్రభుత్వాలు అనుమతించడం వైచిత్రి. కలపదొంగల వల్ల, జంతువుల్ని వేటాడేవారి వల్ల జరిగే నష్టం చాలా చిన్నది. వీరితో పో లిస్తే అడవి ఉనికిని దెబ్బతీసే ప్రభుత్వ విధానాలు అడవులకీ, వాటిని అంటిపెట్టుకొని ఉన్న జనాలకీ తీవ్రమైన శరాఘాతం. ఒకవైపు అటవీభూభాగ విస్తీర్ణం తగ్గిపోతుంటే మరోవైపు ఈ విస్తీర్ణం పెరుగుతున్నట్టుగా ప్రభుత్వం చెబుతున్నది. ఇది అంకెల గారడీ. ఒకప్పుడు మన దేశంలో 30శాతానికి పైగా అడవులు విస్తరించి ఉండేవి. ఇవుడు దేశ భూభాగంలో అటవీ విస్తీర్ణం 21.34శాతం మాత్రమే. దట్టమైన అరణ్యాల జోలికి అసలు వెళ్ళకూడదని అంతర్జాతీయంగా పర్యావరణవేత్తలు పదేపదే చెబుతున్నారు. కానీ మన దేశంలో భారీ డ్యాంల కోసం, రక్షణ విభాగం, జలవిద్యుత్ ప్రాజెక్టులు, గనుల నిర్మాణం కోసం దట్టమైన అరణ్యాల్ని సైతం నిర్మూలిస్తున్నారు. దీని ప్రభావం దీర్ఘకాలికం. జీవవైవిధ్యం దెబ్బతినడమే కాక అకాల వర్షాలు, తుఫాన్లు, వరదలు, భూకంపాలు తలెత్తడానికి దారితీస్తుంది. అభివృాఎద్ధి జరగాలంటే అడవులు అంతరించక తప్పదనే వాదన ముందుకు తెస్తున్నారు.

# బీఆర్ఎస్ పార్టీలో అంతర్యుద్ధం

## ఇంచార్జ్ ఎంపీపీ కట్కూరికి పార్టీలో ప్రతికూల పరిస్థితులు

## కోరం లేక సర్వసభ్య సమావేశం నేటికీ వాయిదా

## పార్లమెంట్ ఎన్నికల వేళ తారు మారవుతున్న రాజకీయం

## పార్టీకి కూసుకుంట్ల ఏం దిశా నిర్దేశం చేస్తారు...?

మర్రిగూడ, మేజర్‌న్యూస్ : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేల మండల బీఆర్ఎస్ పార్టీలో అంతర్యుద్ధం నడుస్తుందా ? ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అవుననే అంటున్నారు. ఎంపీపీ మెండు మోహన్ రెడ్డి అవిశ్వాస తీర్మానంలో పదవి కోల్పోవడంతో జిల్లా అధికారుల ఆదేశానుసారం ఇన్చార్జి ఎంపీపీ బాధ్యతలను కట్కూరి వెంకటేష్ గౌడ్ కు అధికారులు అప్పగించారు. గురువారం ఇన్చార్జి ఎంపీపీ కటూరి వెంకటేష్ గౌడ్ అధ్యక్షతన జరగాల్సిన సర్వ సమావేశం వన్ బై థర్డ్ కోరం లేకపోవడంతో ఎంపీడీవో మునయ్య సభను నేటికీ వాయిదా వేశారు. మండలంలో 11 మంది ఎంపీటీసీలగాను బీఆర్ఎస్ పార్టీకి నలుగురు ఎంపిటిసిలు ఉన్నారు. సర్వసభ్య సమావేశం జరగాలంటే సభ అధ్యక్షుడితో కలిపి నలుగురు ఎంపిటిసిలు హాజరైతే సభ నిర్వహిస్తారు. కానీ నిన్న జరగాల్సిన సర్వసభ్య సమావేశానికి ఇంచార్జ్ ఎంపీపీ కట్కూరు వెంకటేష్ గౌడ్, నామాపురం ఎంపీటీసీ ఊరుపక్క సరిత నాగేష్ మాత్రమే హాజరవడంతో సభ వాయిదా పడింది. సొంత పార్టీ ఎంపీటీసీలు యరుగండ్లపల్లి దంటు జ్యోతి జగన్, వట్టిపల్లి ఎంపిటిసి మెండు మోహన్ రెడ్డి గైర్హాజరవడంతో ఇంచార్జ్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్ గౌడ్ కు సొంత పార్టీలో ప్రతికూల పరిస్థితులు ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న వేళ జరుగుతున్న పరిస్థితులను బట్టి సరికొత్త రాజకీయం జరగడం చర్చనీయాంశమైంది. సొంత పార్టీలో లుకలుకలు జరుగుతున్న దానిపై మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఎంపిటిసి లకు ఏం దిశా నిర్దేశం చేస్తారన్న ఆసక్తి సర్వత్ర వ్యక్తం అవుతుంది.

# పట్టభద్రుల నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలిరావాలి

## కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు యేకుల సురేష్



కొండమల్లేపల్లి, మేజర్‌న్యూస్ : నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్ట భద్రుల నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ మే 3న నల్గొండలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న నామినేషన్ దాఖలు చేస్తున్నారు. ఇట్టి కార్యక్రమానికి ఆయా జిల్లా మంత్రులు, శాసన సభ సభ్యులు పాల్గొంటున్నారు. కావున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా భారీగా తరలిరావలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు యేకుల సురేష్ పిలుపునిచ్చారు.

# జమియాత్ ఉలేమా ఎ హింద్ మండల అధ్యక్షుడికి సన్మానం



కొండమల్లేపల్లి, మేజర్ న్యూస్ : కొండమల్లేపల్లి : మండల కేంద్రానికి చెందిన ముస్లీం మత పెద్ద మౌలానా నజీర్ ఖాస్మి జమియాత్ ఉలేమా ఎ హింద్ మండల అధ్యక్షుడిగా ఐదవ సారి ఏకగ్రీవంగా ఎన్నికైన సంద ర్భంగా పెరుమాళ్ళ వినోద్ కుమార్ శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానిం చారు. వినోద్ కుమార్ ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ముస్లీం లను చైతన్య పరుచుటలో తన కృషి ఎంత ఉందని కొనియాడారు. ఇక పైన కూడా ముస్లింలను సామాజిక విద్య, వైద్య, ఆర్థిక, రంగాలలో చైతన్య వంతం చేయడంలో ఎంతో కృషి చేస్తూ ఇంకా సమాజంలో ఎన్నో ఉన్నత పదవులు పొంది సమాజ సేవ చేస్తూ స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు అర్ధరహితం

## - స్వార్ధపరులు మాత్రమే పార్టీ మారారు



కొండమల్లేపల్లి, మేజర్‌న్యూస్ : స్వార్థపరుల నాయకులు మాత్రమే టిఆర్ఎస్ పార్టీని మారారు తప్ప నిజమైన నాయకులు కార్యకర్తలు ఏ ఒక్కరు కూడా బిఆర్ఎస్ పార్టీని వీడలేదని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రామావత్ దస్రు నాయక్, బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు ఆర్ తులసి రామ్ నాయక్‌లు అన్నారు. గురువారం కొండమల్లేపల్లి పట్టణంలో ఏర్పాటు చేసినటువంటి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొండమల్లేపల్లి వైస్ ఎంపీపీ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ ఖాళీ అయిందని అనడం అవాస్తవమని,రేపు జరగబోయేటటువంటి పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పదివేల ఓట్ల మెజార్టీతో గెలుపొందడం ఖాయమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 10 బిఆర్ఎస్ ఎంపీ సీట్లు గెలవడం ఖాయమని మళ్లీ తెలంగాణ రాష్ట్ర ప్రజలు కెసిఆర్ ప్రభుత్వం రావాలని కోరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్లు గుండెబోయిన లింగం యాదవ్, రమావత్ శ్రీను నాయక్, మాజీ ఎంపీటీసీ శంకర్ నాయక్, ఇస్లావత్ గోవింద్ నాయక్, పెద్దిశెట్టి సత్యనారాయణ, నరేందర్, వరికుప్పల పాండు, తోటపల్లి వెంకటేష్,హరికృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

# పోలింగ్ సమయాన్ని గంట పాటు పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నల్గొండ జిల్లాలోని పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉదయం 7 నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. అందువల్ల లోక సభ ఎన్నికలలో పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ముఖ్యం గా జిల్లా ఓటర్లు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి మే 13న ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే పోలింగ్ లో ఓటర్లందరూ పెద్ద ఎత్తున పాల్గొని ఓటింగ్ శాతాన్ని పెంచాలని ఆమె కోరారు.

# బీజేవైఎం యువ సమ్మేళనంలో నల్గొండ ఎంపి అభ్యర్థి సైదిరెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

నరేంద్ర మోడీ మూడవసారి ప్రధానమంత్రి కావాలంటే మన నల్లగొండ నుండి పోటీ చేసే మన శానంపూడి సైదిరెడ్డి గారిని అత్యధిక మెజారిటీతో గెలిపించి పార్లమెంట్కు పంపించే విధంగా మన యువత ముందుండి ప్రచారం చేసి ప్రతి పథకాన్ని ప్రజలకు తెలియజేసి ఓటు వేయించే బాధ్యత మనపై ఉన్నది కావున తొమ్మిది రోజులు కలసికట్టుగా పనిచేసే గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు వంగూరి రాఖి మాట్లాడుతూ నల్లగొండ గడ్డ పోరాటాల అడ్డా నల్లగొండ గడ్డపై కాషాయపు జెండా ఎగర వేయడమే లక్ష్యంగా యువత కసితో పనిచేసే నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నని గెలిపించడమే లక్ష్యంగా బిజెపి జెండా పట్టుకుని ఈ తొమ్మిది రోజులు యుద్ధం చేస్తూ ప్రజలకు నరేంద్ర మోడీ గారు ప్రవేశపెట్టిన పథకాలను మన యువత అభివృద్ధి కొరకు కొరకు తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు వివరిస్తూ కమలం పోగొట్టుకు ఓటు వేయాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పడగానే యువతకు 50,000 ఉద్యోగాల అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు వారసత్వ రాజకీయాలకు నాంది పలకాలని యువతకు సూచించారు నల్లగొండలో వారసత్వ రాజకీయాలు తప్ప నిరుద్యోగులను పట్టించుకునే నాధుడు లేడని తెలిపారు జానారెడ్డి కుటుంబంలో కుటుంబ రాజకీయం కోమటిరెడ్డి కుటుంబంలో కుటుంబం రాజకీయం ఉత్తమ్ కుటుంబంలో కుటుంబ రాజకీయం తప్ప నిరుద్యోగుల గురించి ఏ ఒక్క రోజు కూడా వారు మాట్లాడలేదు కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పార్టీ అని తెలిపారు కాంగ్రెస్కు దమ్ము ధైర్యం లేక ఇచ్చిన హామీలు అమలు చేయలేక జనం ముందుకు మళ్ళీ ఓట్లని అడగడానికి వస్తున్నారు మీరు వారికి తగిన బుద్ధి చెప్పి దేశంలో బిజెపి 400 సీట్లు తో గెలుస్తుందని అందులో నల్లగొండ ఉండబోతుందని తెలిపారు కావున ప్రతి ఒక్కరు ఆలోచించి జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో యువత కమలం పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు దేశంలో యువత కోసం నరేంద్ర మోడీ గారు చేపట్టే పథకాలు ఎన్నో ఉన్నాయి నాడు దేశం కు అవసరం ఉన్న ప్రతి సామాగ్రిని ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకునే వాళ్ళం నేడు మేకిన్ ఇండియా ద్వారా ప్రతి వస్తువును స్వదేశీ ఉత్పత్తితో తయారుచేసుకొని మన దేశ యువతకి ఉపాధి కల్పిస్తూ మేకిన్ ఇండియాలో తయారు చేసే స్వదేశీ ఉత్పత్తులను ఇతర దేశాలకు ఎగుమతి చేయడంలో ఇవాళ మనం ప్రపంచంలో దిగ్గజంగా నిలబడ్డాం. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి యువమోర్చ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కట్కూరు కార్తిక్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మదగాని శ్రీనివాస్ గౌడ్, పార్లమెంట్ కో కన్వీనర్ పిల్లి రామరాజు, పార్లమెంట్ ప్రభారీ చాడ శ్రీనివాస్ రెడ్డి, యువమోర్చా ప్రధాన కార్యదర్శి చామల పవన్ రెడ్డి, యువమోర్చా పార్లమెంట్ ప్రభారీ నీలకంఠం పాండు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కన్మంత రెడ్డి శ్రీదేవి రెడ్డి, కంకణాల నివేదిత రెడ్డి చెల్లా శ్రీలత రెడ్డి లాలూ నాయక్, చిల్లంచర్ల అభి, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రెవల్లి కిరణ్, బుడిగ భరత్ నేరెళ్ల అజయ్ పట్టణ అధ్యక్షులు దుబ్బాక సాయి, చిట్యాల గోపిరెడ్డి శాంతిస్వరూప్, అనుముల దేవిలు యువనాయకులు పాల్గొన్నారు.

# రైతుపై తూటా

చందంపేట, మేజర్‌న్యూస్ ః రైతాంగ ఆత్మహత్యలు నివారిస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని హామీలిచ్చి కేంద్రంలోను, మధ్యప్రదేశ్‌లోను అందలమెక్కిన బీజేపీ ప్రభుత్వాలు అన్నదాతలపైనే తుపాకీ ఎక్కుపెట్టడం హేయమైన చర్య. ఒకవైపు కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ మరో వైపు రైతులను పిట్టలను కాల్చినట్టు కాల్చిపడేసిన పాలకుల కిరాతకాన్ని ఎంత ఖండించినా తక్కువే. మధ్యప్రదేశ్‌లో రైతులు తాము పండించిన పంటకు మద్దతు ధర కావాలని అడిగారు. ఎన్నికల ముందు బీజేపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మాత్రమే వారు కోరారు. రైతులపైకి పోలీసులను ఉసిగొల్పి ఆరుగురిని పొట్టనబెట్టుకోవడం దుర్మార్గం. సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ ప్రభుత్వమైనా నిర్వర్తించాల్సిన కనీస బాధ్యత. దీనిని విస్మరించి నిరంకుశంగా అణచివేయాలని చూడడం అప్రజాస్వామికం. మధ్యప్రదేశ్‌లో మొదట ఒక జిల్లాలో ప్రారంభమైన రైతుల ఆందోళన క్రమంగా రాష్ట్రంలోని మిగతా అన్ని జిల్లాలకు విస్తరించింది. మందసోర్, పిప్లియామండీ ప్రాంతాల్లో ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి రైతుల పోరాటాన్ని అణచివేయాలని చూసింది. ఈ పాపంలో శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వానికీ వాటా వుంది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేండ్లు గడిచినా రైతాంగాన్ని ఆదుకునేందుకు ఎలాంటి చర్య తీసుకోలేదు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. నయా ఉదారవాద విధానాలతో ఇప్పటికే సంక్షుభితంగా మారిన వ్యవసాయరంగం మోడీ ప్రభుత్వ నిర్వాకం వల్ల మరింత తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడింది. మధ్యప్రదేశ్‌లో కాల్పులు దీనికి పరాకాష్ట. కేవలం ఒక్క మధ్యప్రదేశ్‌లోనే కాదు, బీజేపీ పాలిత రాష్ట్రాల్లోను, దాని మిత్రపక్షాలు అధికారంలో వున్న రాష్ట్రాల్లోను రైతు వ్యతిరేక విధానాలు ఉధృాఎతంగా అమలవుతున్నాయి. మొత్తం రైతు ఆత్మహత్యల్లో 60శాతం దాకా ఈ రాష్ట్రాల్లోనే చోటు చేసుకున్నాయని అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయి. మొదట గుజరాత్ రైతాంగం వీధుల్లోకి వచ్చింది. నేడు మహారాష్ట్రలో రైతాంగ పోరాటాలు ఉధృాఎతంగా సాగుతున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే ఈనాడు బీజేపీ ప్రభుత్వ విధానాలపై ఈ దేశ రైతాంగం తిరుగుబాటు చేస్తోంది. మధ్యప్రదేశ్‌లో రైతాంగ పోరాటం, మహారాష్ట్రలో రైతులు వారం రోజుల పాటు నిర్వహించిన సమ్మె, రాష్ట్ర బంద్ అసాధారణమైనది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర అనే కాదు, మిగతా రాష్ట్రాల్లోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై రైతాంగంలో ఆగ్రహం రగుల్కొంటోంది. చత్తీస్ఘడ్, హర్యానా, జార్ఖండ్‌ల్లో రైతాంగ పోరాటాలు సాగుతున్నాయి. రైతుల పోరాటానికి బాసటగా నిలవాలని సామాజిక కార్యకర్త అన్నా హజారేను రైతు సంఘాలు కోరగా ఆయన అందుకు నిరాకరించారు. ఇది ఆయన సంకుచిత ధోరణికి నిదర్శనం. ఎఐకెఎస్, ఇతర రైతు సంఘాల ఆధ్వర్యాన మహారాష్ట్ర రైతులు పట్టుదలతో పోరాడుతున్నారు. రైతులు తమ నిరసనలో భాగంగా వ్యవసాయోత్పత్తులను పట్టణాలకు సరఫరా చేయడానికి నిరాకరిస్తున్నారు. వాటిని రోడ్లపై పారబోస్తున్నారు. మహారాష్ట్రలోని ఫడ్నవీస్ ప్రభుత్వం రైతులతో చర్చించి సామరస్యంగా దీనిని పరిష్కరించుకోవడానికి బదులు ఈ ఉద్యమాన్ని అణచివేయాలని చూడడం అవివేకం. తమిళనాడులో 140ఏండ్లలోనే అతి పెద్దకరువు గత సంవత్సరం చోటు చేసుకుంది. ఈ కరువు బారిన పడి ఇప్పటివరకు 400మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విపత్కర పరిస్థితినుంచి తమిళనాడును ఆదుకునేందుకు 40వేల కోట్ల ప్యాకేజీ కావాలని తమిళనాడు రైతులు నలభై రోజులకుపైగా ఆందోళన నిర్వహించారు. రాజధాని ఢిల్లీలో దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. రైతులు ఎంత ఘోషించినా రుణమాఫీ చేసే ప్రసక్తే లేదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తెగేసి చెప్పారు. కరువుతో అల్లాడుతున్న తమిళనాడుకు ఇంతవరకు పైసా కూడా సాయం చేయలేదు. పైగా సుప్రీం కోర్టులో దీనిపై కేంద్రం తన వాదన వినిపిస్తూ తమిళనాడులో రైతులెవరూ ఆత్మహత్య చేసుకోలేదని చెప్పింది. ఇది తమిళప్రజలతో క్రూర పరిహాసమాడటమే. రైతులను ఉద్ధరించేందుకే తెచ్చానని ఘనంగా చెప్పుకున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన రైతులకు అక్కరకు రాలేదు. కానీ కార్పొరేట్ బహుళజాతి కంపెనీలకు దండిగా కాసులపంట పండించింది. ఫసల్ బీమా యోజన కింద 2016-17లో ప్రయివేట్ బీమా కంపెనీలు ప్రీమియం రూపంలో రైతుల నుంచి 21,500 కోట్లు దండుకున్నాయి. గత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పరిహారం కింద 4,270 కోట్లు క్లెయిమ్ చేయగా, 714 కోట్లు మాత్రమే ఇచ్చాయి.

# ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే అంతరాలు లేని

## సమాజానికి అవసరమైన విద్య అందించబడుతుంది

## అలుగుబెల్లి నర్సిరెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ






యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : ఉపాధ్యాయ ఉద్యమ జాతీయ నేత, ఎమ్మెల్సీ, పిడిఎఫ్ ఎమ్మెల్సీల కన్వీనర్ దాచురి రామిరెడ్డి 8వ వర్ధంతి సభ గురువారం యాదాద్రి- భువనగిరి జిల్లా యాదాద్రి క్షేత్ర విల్లా ఆడిటోరియంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలని, విద్య ద్వారా విద్యార్థులు సంపూర్ణ వికాసం కలగాలని, సామాజిక మానసిక శారీరక అభివృద్ధి జరగాలని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే అంతరాలు లేని సమాజానికి అవసరమైన విద్య అందించబడుతుందని, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా విద్య అందిస్తూ, ప్రజాస్వామ్య ఈత వాతావరణం కల్పించబడుతుందని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచుకునే అవకాశం కల్పించడానికి ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించి తరగతికి ఉపాధ్యాయుడు ఉండే విధంగా తీర్చిదిద్దాలని ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి కనీసం 18 మంది విద్యార్థులు ఉండే విధంగా చూడాలని పాఠశాలల రీ ఆర్గనైజేషన్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచన చేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కే.జంగయ్య, చావా రవిలు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమాన్ని జాతీయస్థాయికి విస్తరించి విద్యారంగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో కీలక ఉద్యమ నేతగా ఎమ్మెల్సీగా పనిచేసిన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పూర్వ అధ్యక్షులు దాచురి రామిరెడ్డి జ్ఞాపకాలు ఉద్యమ స్ఫూర్తి ఉద్యమానికి ఎంతో అవసరమని తెలుపుతూ నేడు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పెండింగ్ డిఏలు వెంటనే ప్రకటించాలని పదోన్నతుల కోసం కంపల్సరిగా చేసిన టెట్ నిర్వహణపై సర్వీస్‌లో ఉన్న టీచర్ల ఆందోళన పై వివరణ ఇచ్చి సందేహాలను తొలగించాలని, టెట్ నుండి సర్వీస్ టీచర్లను నిర్వహించాలని, సాధ్యాసాధ్యాలు చూడాలని కోరుతూ ఎమ్మెల్సీ నేతృత్వంలో ఎన్‌సిటిఇకి ప్రాతినిధ్యం చేయడానికి ఢిల్లీ వెళుతున్నామని తెలిపారు. పెండింగ్లో ఉన్న బిల్లులన్నింటినీ ఎప్పటికప్పుడు రిలీజ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్ యుటిఎఫ్ నిర్వహిస్తున్న కుటుంబ సంక్షేమ నిధి వార్షిక సమావేశం జరుగుతూ ఉపాధ్యాయ కుటుంబాలకు ఎంతో సహకారిగా ఉన్నదని ఇప్పటివరకు 21 మందికి ఆరు లక్షల చొప్పున బెనిఫిట్స్ అందించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కే.జంగయ్య, ఉపాధ్యక్షులు రాములు, సిహెచ్ దుర్గ భవాని, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ పత్రిక సంపాదకులు పి.మాణిక్ రెడ్డి, కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శిలు ఎ.వెంకట్, నాగమణి, రాజశేఖర్ రెడ్డి, ఈ.గాలయ్య, డి.సత్యానంద్, కే.సోమశేఖర్ శాంతి కుమారి ఆర్.రంజిత్ కుమార్, వై.జ్ఞాన మంజరి, కే.రవికుమార్, 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్లు నాయకత్వం పాల్గొన్నారు.

# నిరుపేదలను ఆదుకుంటున్న గాంధీజీ ఫౌండేషన్

## – నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

## – ఏ ఆసరా లేని నిరుపేదలను ఆదుకోవడమే గాంధీజీ ఫౌండేషన్ ఆశయం

## – చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు





చండూర్, మేజర్‌న్యూస్ : రెండు సంవత్సరములు వరకు ప్రతినెల 20 మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల విలువ చేసే నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలనే లక్ష్యంతో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు ఈ సంవత్సరం జనవరి నెల ఒకటో తేదీన ప్రారంభించిన గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ" కార్యక్రమం గురువారం నాడు స్థానిక గాంధీజీ విద్యాసంస్థల యందు ఐదవ నెల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ జీవితంలో మా కుటుంబం సంపాదించిన సంపాదనలో కొంత శాతం నిరుపేద ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో, మా కుటుంబ సభ్యులంతా ఆలోచించి తీసుకున్న నిర్ణయం అని, భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు మా గాంధీజీ ఫౌండేషన్ తీసుకువస్తుందని తెలిపారు. నిరుపేదలకు చేసే సేవ దేవునికి చేసే సేవతో సమానమని అన్నారు. మనం పుట్టేటప్పుడు ఏమి తీసుకురాలేదని వెళ్లేటప్పుడు ఏమి తీసుకుపోమని, ఉన్నంతవరకు మా కుటుంబం పేదలకు సేవ చేస్తూనే ఉంటుందని తెలిపారు. అదే విధంగా మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని చండూరు చౌరస్తాలో గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ప్రజలందరూ దీనిని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దోటి వెంకటేష్ యాదవ్, కృష్ణారెడ్డి, గాంధీజీ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కోడి అరుణ, భూతరాజు దశరథ, కారింగు రామ్మూర్తి, గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, భూతరాజు శ్రీకాంత్, బోడ యాదయ్య, బుషిపాక యాదగిరి, బోడ విజయ్, గోపి పాల్గొన్నారు.

# ఇంటి ఇంటికి బిజెపి అభ్యర్థి గెలవాలని ప్రచారం చేసిన రామరాజు



నల్గొండ టౌన్, మేజర్ న్యూస్ : నరేంద్ర మోడీని మూడవ సారి కూడా ప్రధానిగా చేయాలనే సంకల్పంతో లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు నల్లగొండ పట్టణంలోని 03వ వార్డు శేషమ్మగూడెం, పాత పల్లె,04వ వార్డు కేషరాజుపల్లిలో స్థానిక నాయకత్వంతో కలిసి గడప గడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ కో కన్వీనర్ – పిల్లి రామరాజు యాదవ్ నరేంద్ర మోడీ మూడవసారి కూడా అధికారంలోకి రావాలని ఈ 10 ఏళ్ళ కాలంలో బీజేపీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను అభివృద్ధి పనులను గడప గడపకు తిరుగుతూ వివరించారు. నల్లగొండలో బీజేపీ పార్టీ బలపరిచిన పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైది రెడ్డికి కమలం పువ్వు గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ముఖ్య అతిథిగా తమిళనాడు బీజేపీ స్టేట్ జనరల్ సెక్రటరీ తిరుప్పూర్ (తమిళనాడు స్టేట్)పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఎ.పి మురుగానందం యువ మోర్చ నల్లగొండ అసెంబ్లీ కో కన్వీనర్ క్రాంతి యాదవ్ బూత్ అధ్యక్షులు జనపాటి శ్రీనివాస్, బొజ్జ జానేష్, అన్నపూరి శ్రీను కోఆర్డినేటర్స్ కత్తుల లింగస్వామి, బంగారి యాదవ్, సంతోష్ శ్రీను, నాగరాజు, వెంకన్న, ముంత ఆంజనేయులు బుచ్చల నాగరాజు గౌడ్ నక్క కళ్యాణ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శాగం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో

# కాంగ్రెస్‌లో చేరిన నాయకులు



తిరుమలగిరి (సాగర్), మేజర్‌న్యూస్ : మండల కేంద్రంలో శాగం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో, నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి సమక్షంలో, టిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిలో టిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు శాగం అంజిరెడ్డి, టిఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు పగడాల సైదులు, మాజీ ఎంపీటీసీ శాగం రామంజి రెడ్డి, టిఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు ఇరిగి గోపి, రాచమల్ల చిన్న కొండల్, ఎరెడ్ల దామోదర్ రెడ్డి, దండెం ఏడుకొండల్, కోమల్ల సైదులు, దాసరి మహేష్, అనుముల సాయి, ఐతరాజు పవన్,లను ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆంగోత్ భగవాన్ నాయక్, మండల కో ఆప్షన్ షేక్ రహీం, పసుపులేటి కృష్ణ, కుప్పాల అంజిరెడ్డి, శ్యామ్, అనుముల శీను, కళమ్మ ,ఇరిగి శీను, నాగార్జున్, ఇరిగి శీను, నాగయ్య, యేసు తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికలలో బిఆర్ఎస్‌కు అత్యధిక సీట్లు



బొమ్మలరామారం, మేజర్‌న్యూస్ : పార్లమెంట్ ఎన్నికలలో బిఆర్ఎస్ కు అత్యధిక సీట్లు రానున్నాయని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్, బిజెపి కుట్ర రాజకీయాలతో ఎలక్షన్ కమీషన్‌కు తప్పుడు నివేదికలు ఇచ్చి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను 48 గంటలు సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకోకుండా నిషేధం విధించడం దారుణమన్నారు. బిజెపి, కాంగ్రెస్ జాతీయ పార్టీలు ప్రాంతీయ పార్టీల మనుగడ లేకుండా చేయాలని విశ్వప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ధరలు పెంచి మోదీ సర్కారు ప్రజల నడ్డి విరిచిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూటా మాటలు మానుకోవాలని అన్నారు. తెలంగాణలో కెసిఆర్ ఎక్కడికి వెళ్ళినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్‌ను,బిజెపిని ప్రజలు బొందపెట్టడం ఖాయమన్నారు. అనంతరం బిఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్, కల్లూరి రాంచెంద్రారెడ్డి, సుదగాని హరిశంకర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోలగొని వెంకటేష్ గౌడ్, ఎంపిపి చిమ్ముల సుధీర్‌రెడ్డి,పీఏసియస్ ఛైర్మన్ గూదె బాల్‌నర్సింహ, కుశంగల సత్యానారాయణ, మండల కేంద్రం మాజీ ఉపసర్పంచ్ జూపల్లి భరత్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదులతో ప్రచారం చేసిన సైదిరెడ్డి



నల్లగొండ టౌన్, మేజర్‌న్యూస్ : గురువారం ప్రచారంలో భాగంగా నల్లగొండ నియోజకవర్గంలో నల్గొండ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి నల్గొండ బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులనుద్దేశించి దేశం కోసం, నరేంద్ర మోడీ ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకోవడం వల్ల మన భావితరాలకు మన పిల్లల భవిష్యత్తు తరాలకు బాగుండాలంటే నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి రావాలి 70 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఇతర దేశాల నుండి ప్రతి వస్తువు దిగుమతి చేసుకునే వాళ్ళం ఈరోజు నరేంద్ర మోడీ పాలనలో మెక్ ఇన్ ఇండియాలో భాగంగా ప్రతి వస్తువు మన భారతదేశంలోనే స్వదేశీ ఉత్పత్తులు తయారు చేసుకొని ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగాము యువతకు అవకాశాలు కల్పించడం ప్రోత్సహించడం ఉద్యోగాలు కల్పించడం ద్వారా ఎంతో ముందు అడుగులో ఉన్నాము దేశ పరిరక్షణ కోసం 24 గంటలు పని చేస్తున్న నరేంద్ర మోడీ గారిని చూసి బిజెపి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి నన్ను గెలిపిస్తే నేను నల్గొండ జిల్లా న్యాయవాదుల సమస్యల పరిష్కారాన్ని మోడీ గారి దృష్టికి తీసుకుపోయి మీ యొక్క సమస్యలు పరిష్కరిస్తానని నల్గొండ పార్లమెంట్ ని అభివృద్ధి పదాలకు తీసుకెళ్తానని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరి, లింగయ్య గౌడ్, నూకల నరసింహా రెడ్డి, మాలే వెంకట్ రెడ్డి, పివి శ్యామ్ సుందర్ రావు, గాలి శ్రీనివాస్, గుండాల నరేష్, చుక్కల నాగరాజు, హరికుమార్ గార్లు మరియు సీనియర్, మహిళా, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# హరీష్ రావు రోడ్ షోని విజయవంతం చేయండి

## మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

మునుగోడు, మేజర్‌న్యూస్ : భువనగిరి బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ మద్ద తుగా శుక్రవారం చండూరు మండలంలో సాయంత్రం నిర్వహించే హరీష్ రావు రోడ్ షోని విజయవంతం చేయాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కార్యకర్తలను కోరారు.గురువారం మండల కేంద్రంలోని ఓఫంక్షన్ హాల్లో మండల కమిటీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. హరీష్ రావు రోడ్ షోకు మండలం నుండి అధిక సంఖ్యలో తరలి వచ్చి క్యామ మల్లేష్‌కు మద్దతుగా నిలవాలన్నారు. బిఆర్ఎస్ పార్టీ నుండి వెళ్లి పోయిన వాళ్ళతో పార్టీకి ఏలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. ప్రతి బిఆర్ఎస్ కార్యకర్తను కాపాడుకుం టానని అధైర్య పడవద్దు అండగా ఉంటానని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తకు మార్గ నిర్దేశకుడు అని ఆయన ఇచ్చే ఆదేశాను సారం పనిచేయాలని తెలిపారు. ఎవరు కూడా నిరుత్సపడవద్దన్నారు. బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పగిళ్ల సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మునుగోడు నియోజక వర్గం పార్లమెంట్ ఎన్నికల ఇన్చార్జి గోపగాని వెంకటనారాయణ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు మందుల సత్యం, బిఆర్ఎస్ నాయకులు పోలగోని సైదులు, మేకల శ్రీనివాస్ రెడ్డి,మారగోని అంజ య్య, చెరుకు కృష్ణయ్య, ఐతగోని విజయ్, జక్కలి లోకేష్, పూల వెంకన్న, పంతంగి స్వామీ,గజ్జెల బాలరాజు వనం లింగయ్య, వివిధ గ్రామ సర్పంచులు ఎంపీటీసీలు గ్రామ శాఖ అధ్యక్షులు మనం లింగయ్య లోకేష్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# రాజ్యాంగం రద్దు చేస్తారని చర్చ రావడం సమాజానికి ప్రమాదం

## టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య యాదవ్



మునుగోడు, మేజర్‌న్యూస్ : రిజర్వేషన్ల రద్దు చేస్తారనే దాని పై చర్చ జరగడం పట్ల పేద వర్గాల్లో అభద్రతాభావ నెలకుందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య యాదవ్ అన్నారు. గురువారం మునుగోడులో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల అనంతరం రాజ్యాంగం రిజర్వేషన్లు రద్దు చేస్తారనే చర్చ సమాజానికి ప్రమాదకరమన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా ఇచ్చిన రిజర్వేషన్లు లేకపోతే విద్య, ఉద్యోగ రాజకీయ రంగాలలో పేద వర్గాలు మరింత దిగజారిపోయేవారని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీలకు రిజర్వ్ స్థానాలు లేకపోతే ఎమ్మెల్యేలు, ఎంపీలు మంత్రులుగా మొత్తం పెత్తందారి వర్గాలే రాజ్యమేలేవని తెలిపారు. స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు ఎన్టీఆర్ ప్రవేశపె ట్టకపోతే బీసీలు సర్పంచులుగా కాలేకపోయేవారని అన్నారు. అలాంటి రిజర్వేషన్లపై రద్దు చేస్తారని చర్చ పేద వర్గాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం గద్దె దించడంలో టిడిపి శ్రేణులు కీలక పాత్ర పోషించారని అన్నారు. టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మక్కెన అప్పారావు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల లింగయ్య, నాయకులు పొడపంగి సైదులు, వలిగొండ మాధవ్, నరసింహ, ఏర్పుల సురేష్ పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ సెల్ కోఆర్డినేటర్

# వట్టికోటి శేఖర్ జన్మదిన వేడుకలు

## – చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపును కాంక్షిస్తూ వాహన స్టిక్కర్లు విడుదల



మునుగోడు, మేజర్‌న్యూస్ : మండలంలోని కోతులారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ వట్టికోటి శేఖర్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు.అనంతరం కేక్ కట్ వట్టికోటి శేఖర్ కు శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం వట్టికోటి శేఖర్ తన జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు ఇస్తూ రాబోయే భువనగిరి పార్లమెంటు ఎన్నికల్లో టీం వట్టికోటి తరపున భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డినీ అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కోరారు. శ్యామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపును కాంక్షిస్తూ వాహన స్టిక్కర్లు విడుదల చేసినారు. ఈ కార్యక్రమంలో బైకాని కృష్ణ, జక్కలి మల్లేష్,ఐతారాజు రాజు, గుత్తి శివ కుమార్, అనంతం నరేష్ ,సుర రాకేష్,డబ్బా నరేష్, టేకుమట్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# దశదినకర్మకు హాజరైన ఎమ్మెల్యే



హాలియా, మేజర్‌న్యూస్ : హాలియా మున్సిపాలిటీ 3వ వార్డుకు చెందిన దేవన బోయిన కృష్ణయ్య (లారీ డ్రైవర్) గత 10 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోగా గురువారం వారి దశ దిన కార్యక్రమానికి నాగార్జునసాగర్ శాసన సభ్యు లు కుందూరు జయవీర్ హాజరై వారి యొక్క చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లు అర్పించటం జరిగినది. ఈ కార్యక్రమంలోజిల్లా అధికార ప్రతినిధి కాకునూరి నారాయణ గౌడ్, జిల్లా నాయకులు గడ్డంపల్లి సాగర్ రెడ్డి, అనుముల మండల అధ్యక్షులు కుందూరు వెంకట్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గౌని రాజా రమేశ్ యాదవ్, టౌన్ అధ్యక్షులు వేంపటి శ్రీను, చేర్కుపల్లి ముత్యాలు, అనుముల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నకిరేకంటి సైదులు,మూడవ వార్డు ఇంఛార్జి బొంగరాల యేసురాజు, వెంకన్న,సురేందర్,మహేష్,యాకోబు,శ్రవణ్ పాల్గొన్నారు.

# బిజెపి, బీఆర్ఎస్‌ల ఓటమి తథ్యం

## – కాంగ్రెసు గెలుపు ఖాయం



కొండమల్లేపల్లి, మేజర్‌న్యూస్ : బిజెపి, బి.ఆర్.ఎస్‌లను ఓడించి ప్రజా ఆస్తులను ప్రజాస్వామ్యాన్ని కాపాడుతానని ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటానని వాగ్దానం చేసిన ఇండియా కూటమికి చెందిన కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి గెలిపిద్దాం అని తెలంగాణ జన సమితి దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు కర్ణకంటి కిరణ్ ఓటర్లకు విజ్ఞప్తి చేసినారు. ఈ సందర్భంగా "ఇండియా కూటమిని బలపరుద్దాం - కాంగ్రెస్‌ను గెలిపిద్దాం" అనే కరపత్రమును ఆవిష్కరించినారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ బిజెపి 2014 ఎన్నికలలో 100 స్మార్ట్ సిటీలు కట్టించి ఆ స్మార్ట్ సిటీలలో 100 ఫ్యాక్టరీలు పెట్టించి సంవత్సరానికి రెండు కోట్ల యువకులకు ఉద్యోగాలు ఇస్తానని మోడీ అన్నారు. 2024 వచ్చేసరికి అవన్నీ పక్కన పెట్టి మన పిల్లల పుస్తకాల 18 శాతం జీఎస్టీ పన్ను వసూలు చేస్తూ చివరికి మనం తినే బియ్యం, పప్పు ధాన్యాల పై, జీఎస్టీ పన్ను వసూలు చేసి ప్రజలను దివాలా తీసిన మోడీ ఆర్థిక నిర్వహణ వైఫల్యం చెందారు. కేసీఆర్ ఎన్నో అడ్డదారులు తొక్కి విచ్చలవిడిగా డబ్బులు కుమ్మరిచ్చి కొన్ని సీట్లు సంపాదించి కేంద్ర ప్రభుత్వంతో బేరాలు ఆడి తమ గత 10 సంవత్సరాల్లో లో చేసిన అక్రమాల నుండి కుంభకోణాల నుండి రక్షణ పొందడానికి ప్రయత్నిస్తున్నారు. బిఆర్ఎస్ గెలుపు తెలంగాణకు ఏ విధంగా ఉపయోగపడలేదు. 2014లో 5.4%గా ఉన్న నిరుద్యోగం 20-23 డిసెంబర్ నాటికి 8.7% పెరిగింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పది లక్షల ఉద్యోగ ఖాళీలు ఇప్పటివరకు భర్తీ చేయలేదు ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణతో మరిన్ని ఉద్యోగాలు పోయాయి. దేశంలో డిగ్రీ పీజీ చదివిన ప్రతి ముగ్గురిలో ఒకరు ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నారు. భావితరాలకు బ్రతుకు భరోసానిచ్చే భారత రాజ్యాంగ విలువలను కాపాడే ప్రజాస్వామ్యానికి జీవం పోసే రాజకీయాలను తెస్తున్న ఇండియా కూటమి గెలుపు ఇవాళ అందరికీ అవసరం. అందుకే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం అని విజ్ఞప్తి చేసినారు.ఈ కార్యక్రమంలో జంగిటి సత్యనారాయణ, సిద్దు, వెంకటయ్య, హేము నాయక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.